తాగునీటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు

పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ఉంగుటూరు: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సిపి డబ్ల్యు స్కీమ్ సక్రమంగా నిర్వహించాలని జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు అన్నారు. బుధవారం ఉంగుటూరులో ఎర్ర చెరువు వద్ద ఎనిమిది గ్రామాలకు తాగునీటిని అందించే సిపిడబ్ల్యు స్కీమ్‌ను ఆయన సందర్శించారు. పంపింగ్ తీరుపై ఆరా తీశారు. రావులపర్రు, దొంతవరం, కాగుపాడు, పొట్టిపాడు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. క్లోరినేషన్ ఎలా జరుగుతుందని అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపిడిఒ జి.రామ్‌మనోజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, స్కీమ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఎం సారూ.. ముంపు లెక్కలు సరిచేయరూ..!

పోలవరం నిర్వాసితుల గోడు అరణ్య రోదనేనా

భద్రాచలం వద్ద 45 అడుగులకే గ్రామాలు మునక

41.15 కాంటూరులో చేర్చకుండా అన్యాయం

ప్రాజెక్టులో నీరు నింపితే చాలా గ్రామాలు జలమయం

పరిహారమిచ్చి పంపించాలని వేడుకోలు

నేడు పోలవరంలో సిఎం పర్యటన

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కుక్కునూరు, వేలేరు మండలాల నిర్వాసితులు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పోలవరం కాంటూరు లెక్కలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చిన్నపాటి వరదకు మునుగుతున్న గ్రామాలను సైతం 45.75 కాంటూరులో చేర్చారు. ప్రతియేటా మా గ్రామాలు మునగడం.. మేమంతా కొండలు, గుట్టలు, పునరావాస కేంద్రాలకు వెళ్లడం అధికారుల సమక్షంలోనే జరుగుతోంది. అయినప్పటికీ మా గ్రామాలు తొలివిడత ముంపులో లేవని చెప్పడం ఏవిధంగా న్యాయమో మీరే చెప్పాలి' సిఎం సారూ.. ముంపు లెక్కలు సరిచేయండి.. లేకపోతే ప్రాజెక్టులో నీరు నింపితే మా బతుకులు జలసమాధి అవుతాయని పోలవరం నిర్వాసితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. సిఎం చంద్రబాబు గురువారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వస్తుండటంతో తమ గోడు పట్టించుకోవాలని నిర్వాసితులంతా వేడుకుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లెక్కల ప్రకారం 41.15 కాంటూరులో ముంపునకు గురయ్యే గ్రామాలను తొలివిడతగా ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కుక్కునూరు మండలంలో తొమ్మిది గ్రామాలు, వేలేరుపాడు మండలంలో 31 గ్రామాలు మాత్రమే ఉన్నాయి. 41.15 కాంటూరు పరిధిలో నిర్వాసితులకు పెండింగ్ ఉన్న పునరావాస ప్యాకేజీ సొమ్మును ఇటీవలే ప్రభుత్వం జమ చేసింది. ఇంకా ఇంటి స్ట్రక్చర్ వాల్యూ, భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం వంటి పలు సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. అసలు విషయం ఏమిటంటే ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెక్కలకు, వరదలకు మునుగుతున్న గ్రామాలకు పొంతన లేకుండాపోయింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులకు చేరేసరికి చాలా గ్రామాలు మునిగిపోతున్నాయి. అలాంటి గ్రామాలు సైతం తొలివిడత తరలించే 41.15 కాంటూరులో చేర్చలేదు. ఆ గ్రామాలనుసైతం 45.75 కాంటూరులో చేర్చారు. ఆయా గ్రామాల నిర్వాసితులకు పరిహారం ఇవ్వడం లేదు. 2022 గోదావరి వరద పరిస్థితిని బట్టి చూస్తే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. ఇళ్ల పైకప్పుల నుంచి వరద నీరు పారింది. ఇదంతా కళ్ల ముందే జరిగినా అధికారులు కాంటూరు లెక్కల పేరుతో మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని నిర్వాసితులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. తమకు న్యాయం చేయాలని రెండు రోజుల క్రితం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన మద్దిరాల, ఆంబోతులగూడెం, యల్లప్పగూడెం, కొత్తూరు, మాధవరం, సుద్దగంప, వసంతవాడతోపాటు దాదాపు పది గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి ఉన్నతాధికారులకు వినతులు అందించారు. గ్రామాలు ముంపునకు గురవుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది.

ప్రాజెక్టులో నీళ్లు నింపితే అక్కడి ప్రజల పరిస్థితి ఏమిటి?

వచ్చే ఏడాది నాటికి 41.15 అడుగుల ఎత్తుకు ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు నింపి సాగుకు నీరందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. 41.15 కాంటూరు పరిధిలో గ్రామాలను మాత్రమే ఖాళీ చేయించి ప్రాజెక్టులో నీళ్లు నింపితే ముంపు బారిన పడుతున్న మిగిలిన గ్రామాల ప్రజల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలి. వాళ్లంతా ఎక్కడకు వెళ్లాలనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. అదే సమయంలో చుట్టూ నీళ్లు వచ్చేసిన తర్వాత ముంపులో లేవని చెబుతున్న గ్రామాల ప్రజలు ఏవిధంగా జీవనం సాగించాలి. సాగు చేసేందుకు భూములుండవు. ఉపాధి దొరకదు. అక్కడ నిర్వాసితులు ఏ విధంగా బతకాలో పాలకులకు అర్థమవుతుందో, లేదో కూడా తెలియని పరిస్థితి ఉంది. మండలం యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లిస్తే తప్ప నిర్వాసితులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. అశాస్త్రీయంగా చేసిన కాంటూరు లెక్కలనే ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ముందుకు సాగడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. ఇప్పటికైనా ముంపు గ్రామాలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకపోతే నిర్వాసితుల బతుకులు జలమయమవుతాయనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.

4 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం

పామాయిల్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం - జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి నాలుగు వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధంగా ఉందని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండోరోజు బుధవారం ఆమె ఏలూరు జిల్లా ప్రగతి గురించి ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఇలు స్థాపించడానికి ముందుకొచ్చే వారికోసం భూములు సిద్ధంగా ఉన్నాయన్నారు. వ్యవసాయ, పర్యాటక రంగాల్లో ఏలూరు జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో పామాయిల్ విస్తృతంగా సాగు చేయడానికి ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ద్వారకాతిరుమల ఆలయంతోపాటు జిల్లాలోని మిగిలిన ఆలయాలు, పొరుగు జిల్లాల్లో దేవీపట్నం గండిపోచమ్మ ఆలయం, పాపికొండలు తదితర ప్రాంతాలన్నీ ఉదయం నుంచి సాయంత్రంలోపు చూసి వచ్చేలా ప్రణాళికలు రూపొందించి పర్యాటకులను ఆకర్షిస్తున్నామన్నారు. తలసరి ఆదాయం రూ.4 లక్షలు సాధన లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామన్నారు. జిల్లాలో మామాడి రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు.

మమ్మల్ని బదిలీ చేయండి.. లేదా రక్షణ కల్పించండి

ఎంపిడిఒకు మొరపెట్టుకున్న ఎ.గోకవరం సచివాలయ కార్యదర్శి, సిబ్బంది

వినతి అందిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - ఉంగుటూరు

'మేము ఇక అక్కడ ఉద్యోగాలు చేయలేం.. మమ్మల్ని వేరేప్రాంతానికి బదిలీ చేయండి. లేదా సచివాలయం వద్ద పోలీస్ రక్షణ ఏర్పాటు చేస్తేనే మేము ఉద్యోగాలు చేయగలం.. లేదంటే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోతాం' అని మండలంలోని ఎ.గోకవరం పంచాయతీ కార్యదర్శి కె.కుసుమతోపాటు డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు, ఇతర ఉద్యోగులు ఎంపిడిఒ రాజ్‌మనోజ్ వద్ద వాపోయారు. వారు బుధవారం ఎంపిడిఒను కలిసి తమ గోడు చెప్పుకున్నారు. కొద్ది నెలలుగా గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు, కొంతమంది గ్రామస్తులు అకారణంగా తమను ఏకవచనంతో సంబోధిస్తూ అసభ్యంగా మాట్లాడుతూ దౌర్జన్యం చేస్తూ తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి కుసుమ ఫిర్యాదు చేశారని ఎంపిడిఒ రాజ్ మనోజ్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

మండలం యూనిట్‌గా పరిహారం చెల్లించండి

పోలవరం నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సిఎం చంద్రబాబుకు సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను యూనిట్‌గా గుర్తించి అందరికీ పరిహారం ఇవ్వాలని, 18 ఏండ్లు నిండిన యువతీ యువకులందరికీ పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలనకు మూడుసార్లు వచ్చారని, అయితే ఆ ప్రాజెక్టుకు తమ భూములిచ్చి త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం తీవ్ర ఆవేదన కల్గిస్తోందని ఆయన పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యపై పోలవరం పర్యటనలో ఇప్పటి వరకూ మాట్లాడలేదని, కనీసం నిర్వాసితుల కాలనీలో సౌకర్యాలు లేక వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునే ప్రయత్నమూ చేయలేదని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 159 గ్రామాలకుగాను కేవలం 39 గ్రామాలకు మాత్రమే పరిహారం ఇచ్చారని, కాంటూర్ లెక్కలు తప్పు అని 2022 గోదావరి వరదలు తేల్చాయని గుర్తు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించడం ద్వారానే నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. పదేళ్ల క్రితం హామీ ఇచ్చిన ప్యాకేజీని ఇప్పుడు ఇవ్వడం సమంజసం కాదని, ప్రస్తుత ధరకు తగ్గట్లుగా పెంచి ఇవ్వాలని కోరారు. ఏళ్లు గడుస్తుంటే జనాభా పెరుగుదలతోపాటు వయస్సు పెరగడంతో 18 ఏళ్లు దాటినవారి సంఖ్య పెరుగుతుందని తెలిపారు. 2017 కటాఫ్ తేదీగా నిర్ణయించి అప్పటికి 18 సంవత్సరాలు నిండిన వారికే పరిహారం అని చెబుతున్న ప్రభుత్వం, నేటికీ పునరావాసం కల్పించకుండా ఆలస్యం చేసిన ఫలితంగా వీరి సంఖ్య క్రమేపీ పెరుగుతుందని, జిల్లాకు ఒక రీతిలో కటాఫ్ తేదీ నిర్ణయించడం అన్యాయమని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు కటాఫ్ తేదీ 2022 అక్టోబర్ 7గా నిర్ణయించి ఈ జిల్లాకు 2017గా నిర్ణయించడం సరైన పద్ధతి కాదని అభ్యంతరం తెలిపారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంటూర్‌తో సంబంధం లేకుండా పరిహారం ఇస్తామని చెప్పి, తాజాగా తొలుత తరలించే గ్రామాలకే పరిహారం చెల్లించడం అనేది దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలవరం వస్తున్న సందర్భంగానైనా నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవాలని, వారికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున కోరుతున్నామన్నారు.

రూ.211.34 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను రూ.211.34 కోట్లతో పాలకవర్గం ఆమోదించింది. మేయర్ నూర్జహాన్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం బుధవారం జరిగింది. ప్రారంభ నిల్వగా రూ.46.20 కోట్లు చూపారు. ప్రభుత్వం నుండి వివిధ గ్రాంట్ల రూపంలో రూ.84 కోట్లు నిధులు వస్తాయని అంచనా వేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.165 కోట్లు ఆదాయం లభిస్తుందని అంచనాలను రూపొందించారు. 2025-26వ సంవత్సరానికి వ్యయం రూ.199 కోట్లుగా అంచనా వేశారు. వచ్చే ఏడాదికి రూ.11.82 కోట్లు మిగులు ఉంటుందని అంచనా వేశారు. సమావేశంలో మధ్యలో టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. టిడిపి కోఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం మాట్లాడుతూ అధికార పక్షం ఏది చెబితే అదే జరుగుతుందని, వైసిపి కార్పొరేటర్లు మాట్లాడొద్దని వ్యాఖ్యానించారు. దీనిపై వైసిపి కార్పొరేటర్లు అభ్యంతరం చెప్పడంతో వాగ్వివాదం చోటుచేసుకుని కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నగర కమిషనర్ భానుప్రతాప్ జోక్యం చేసుకుని వైసిపి సభ్యులు అడిగిన అంశాలపై వివరణ ఇచ్చారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను కార్పొరేటర్లకు తెలియకుండానే నిర్వహిస్తున్నారని విమర్శించారు. దీనిపై కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు డివిజన్ల పరిధిలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలూ నిర్వహించలేదని, ఏమైనా నిర్వహిస్తే అందరికీ తెలియజేస్తామని చెప్పారు. అనంతరం సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించారు.

ఏజెన్సీలో భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రధాన రహదారులు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలి

ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో భూ వివాదాలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం కెఆర్‌పురంలోని ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు చెందాల్సిన వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. గిరిజనుల భూసమస్యలు పరిష్కరించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భూసమస్యలు పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు గిరిజనేతరులకు అనుకూలంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా గిరిజనులకు ఆ భూములపై హక్కు పట్టాలు ఇవ్వాలన్నారు. పోడు భూములను సాగు చేస్తున్న గిరిజన పేదలకు అటవీ హక్కు చట్టప్రకారం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. చట్టాలను అమలు చేయమంటే అటవీ అధికారులు గిరిజనులపై దాడులు చేయడం హేయమైన చర్యని అన్నారు. దాడులు చేసిన అటవీ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బాధితులకు అండగా ఆందోళన చేపడతామని అన్నారు. గిరిజన చట్టాలను అమలు చేయాల్సిన ప్రజాప్రతినిధులు గిరిజనేతరులకు అండగా కేసులు, సంఘాలు పెట్టాలని సూచించడం సబబు కాదన్నారు. గిరిజన చట్టాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు విఘాతం కలిగిస్తే ఎర్రజెండా చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రాజెక్టు నిర్మాణం పట్ల ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పనలో లేదని మండిపడ్డారు. అన్ని కొండ కాలువలు, వాగులపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలన్నారు. పట్టెన్నపాలెం, జల్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, తెల్లం దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.ఫ్రాన్సిస్, రైతు కూలీ సంఘం నాయకులు సోమరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో గిరిజన విద్య, వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్న సరుకులు నాణ్యత ఉండటం లేదన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు స్పందించడం లేదన్నారు. గిరిజన ఉప సంచాలకులు (డిడి) పోస్ట్ ఖాళీగా ఉందని, ఐటిడిఎలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. బుట్టాయగూడెం అల్లికాలువ మల్టీ స్పెషాలిటీ, పోలవరం 30పడకల ఆసుపత్రుల నిర్మాణం పూర్తి చేసి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. జిఒ నెం.3కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. డ్రెయిన్లు, ఇళ్ల స్థలాలు, తాగునీరు, శ్మశాన స్థలాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎఒ రామారావుకు నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలోజు నాగేశ్వరరావు, బొరగం భూచంద్రరావు, చంద్రు బుల్లెమ్మ, తామా బాలరాజు, ఎస్.సాయికృష్ణ, వెట్టి వీరయ్య, టి.శాంతి, ఎం.పోశమ్మ, పి.రాజు, కె.శ్రీను, ఎం.చలపతి, టి.వెంకటలక్ష్మి, పి.శేఖర్, గంగులు పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ సెంటర్‌ను సందర్శించిన ఎంఎల్‌సి

వినతి అందిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని బుధవారం ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు వారి సమస్యలను ఎంఎల్‌సి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపల్ ప్రమోషన్స్‌లో జరిగిన అన్యాయం సరిచేయాలని, కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులర్ చేసే ప్రక్రియ, ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల్లో పని చేస్తున్న వారికి హెల్త్ కార్డుల మంజూరు, జిపిఎస్ స్థానంలో ఒపిఎస్ సాధన గురించి అధ్యాపకులు ఎంఎల్‌సితో చర్చించారు. అలాగే తెలుగును ఆప్షనల్‌గా కాక కచ్చితంగా అందరికీ తెలుగు సబ్జెక్టు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌సి గోపీమూర్తి ఈ విషయాలను శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి.శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలని, అర్హులకు పెన్షన్లు ఇవ్వాలని, సుందరయ్య కాలనీ, కుమ్మరిరేవులో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని తదితర ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పది రోజులుగా ప్రజా చైతన్య యాత్ర పేరుతో నగరంలో వివిధ ప్రాంతాలు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న నేపథ్యంలో ఆ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఈ ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వంపై ప్రజానీకం ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా ప్రజా సమస్యలేవీ పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రధానంగా నగరంలో దాదాపు ఆరు వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలుగా అర్హులైన వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు పెన్షన్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, నగరంలో ప్రధాన ఆదాయ వనరులైన జ్యూట్‌మిల్లులు మూతపడి ఉపాధి అవకాశాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. 19వ డివిజన్ సుందరయ్య కాలనీ, 29వ డివిజన్ కుమ్మరి రేవుల్లో రోడ్లు, డ్రెయినేజీల సౌకర్యాలు లేక ప్రజానీకం అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో ప్రజానీకానికి తాగునీరు లేదని, సుద్ధ నీరుతో అనేక అవస్థలు పడుతున్నారని, ఫ్లోరైడ్ సమస్య వల్ల ప్రజలు రోగాల పాలవుతున్నారని తెలిపారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో ప్రజానీకానికి గోదావరి జలాలు సరఫరా చేయాలని కోరారు. కుమ్మరిరేవు ఏటిగట్టు ప్రాంతానికి డ్రిల్ బోర్ ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ఎస్‌సి, బిసిలకు 50 సంవత్సరాలు నిండిన వారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తంగెళ్లమూడి ప్రాంతంలో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ఎస్‌టిపి ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటికి వెంటనే కనెక్షన్లు ఇచ్చి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. నగరంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ ధర్నాకు నాయకులు వైఎస్.కనకారావు, కె.రామాంజనేయులు, వివిఎన్.ప్రసాద్, గొట్టాపు రవికిషోర్, కంది విశ్వనాథం, ఎం.ఇస్సాక్, బి.సోమయ్య, జె.గోపి, కె.విజయలక్ష్మి, జి.ఏసుబాబు, మీసాల సత్యనారాయణ తదితరులు నాయకత్వం వహించారు.

ఏలూరులో ధర్నా

నూజివీడులో ధర్నా

నూజివీడు టౌన్: ప్రజాచైతన్య యాత్రలో తమ దృష్టికొచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎంఆర్.హనుమాన్లు మాట్లాడుతూ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణం తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, పట్టణ పరిధిలో కూడా ఉపాధి హామీ పనులు చేపట్టాలని కోరారు. ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులపై వేస్తున్న భారాలు ఆపివేయాలని, నూజివీడు ఎన్‌టిఆర్ కాలనీలో పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని, అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లు వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేంపాడు అగ్రహారం, నియోజకవర్గంలో ఇతర గ్రామాల్లో ఎప్పటి నుండో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలో, ఇతర వార్డుల్లో పక్కా డ్రెయినేజీల నిర్మాణం చేపట్టి పారిశుధ్యం మెరుగుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కోతులు, కుక్కల బెడద నివారణకు శాస్త్రీయ పరిష్కారం చేపట్టాలని, అధిక ధరలు అరికట్టి నిత్యావసర వస్తువులు పేదలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాలేటి సుభాష్ చంద్రబోస్, ఆర్.మరియదాస్, ఐద్వా నాయకులు నండూరి పద్మాంజలి, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

నిడమర్రు: మండలంలోని అడవికొలను గ్రామంలోని ఆకుమాడుదిబ్బ ప్రజలు తాగునీరందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ఆ సమస్య వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆకుమాడు దిబ్బలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గవర సత్యనారాయణ, కోన శ్రీనివాస్, కమలి నాని, పోలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: అడవికొలనులో

2027 డిసెంబర్‌కు ప్రాజెక్టు పనులు పూర్తి

సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పోలవరం

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నిమ్మల

2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పనులను పూర్తి చేసేలా డిజైన్లకు అనుమతుల కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సిఎం పోలవరం ప్రాజెక్టు పనుల పరిశీలనకు గురువారం రానున్న నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లను మంత్రి నిమ్మల బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ నిర్వాకం వల్ల కొత్తగా రూ.990 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మించాల్సి వస్తుందన్నారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ, సిడబ్ల్యుసి, పిపిఎలను ఎప్పటికప్పుడు సమన్వయపర్చుకుంటూ 2027 డిసెంబర్‌కు ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నేతలు

మండలంలోని ఉపాధి హామీ కూలీలకు మూడు నెలల నుండి కూలీ సొమ్ము పెండింగులో ఉందని, ఆ సొమ్మును వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. పంగిడిగూడెంలో బుధవారం ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు నేతలు వెళ్లి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. దానిలో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించిన ఫలితంగా వంద రోజులు పని కల్పించని వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. తట్ట, పలుగు, పార, తాగునీరు, నీడ కోసం టెంట్లు సౌకర్యం వంటి వాటిని ఎత్తేశారన్నారు. రెండు పూటలా ఫేస్ యాప్‌లో మస్టర్ వేసిన వారికే పూర్తిస్థాయి కూలీ ఇస్తామని మెలిక పెట్టారని, అసంబద్ధమైన నిబంధనలతో ఉపాధి కూలీల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. కూలి బకాయి 15 రోజులు దాటితే చట్టరీత్యా నేరమన్నారు. మూడు నెలలు కావొస్తున్నా ఉపాధి కూలీలకు వారి కూలిసొమ్ము విడుదల చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. తక్షణమే బకాయిల సొమ్ము విడుదల చేయాలని, లేకుంటే కూలీలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, నేతలు మానుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలి

పిడిఎస్‌యు ఆధ్వర్యాన వర్ధంతి కార్యక్రమం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఉన్న బిసి బాలుర పాఠశాల వసతి గృహంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూషణం మాట్లాడుతూ పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భగత్ సింగ్ 94వ వర్ధంతి స్మారక వారోత్సవ సభను బుట్టాయగూడెం బిసి బాలుర పాఠశాల వసతి గృహంలో నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ యువత విద్య, ఉపాధి కోసం తమ హక్కుల కోసం పోరాడాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నూజివీడు విద్యార్థి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పోలుకొండ కృష్ణశేషసాయి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఈ నెల 27, 28, 29, 30 తేదీల్లో కటక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు కృష్ణశేష సాయి వెళ్లాడు. ఈ సందర్భంగా అతని తల్లిదండ్రులు నాగలక్ష్మి, పురుషోత్తమ దేవ్ మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడలో తమ కుమారుడు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి జట్టులో నేషనల్ లెవెల్ పోటీలకు రావడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రం ఖ్యాతి దశ దిశలా వ్యాపింపచేయాలని అభిలాషించారు.

నేరాలు - ఘోరాలు

భవనంపై నుంచి పడి అపస్మారక స్థితిలోకి బాలుడు

ప్రజాశక్తి - వేలేరుపాడు

మండలంలోని మేడేపల్లి గ్రామపంచాయతీ కమ్మరిగూడెం గ్రామానికి చెందిన మిడియం చిన్నబాబు నిద్రలో భవనంపైనుంచి పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నబాబు అర్ధ రాత్రి సమయంలో పిట్టగోడలేని బిల్డింగ్‌పై నుంచి నిద్రలో కిందకి పడి అపస్మార స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు తెల్లవారుజామున 108 వాహనంలో వేలేరుపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జనసేన మండల ప్రెసిడెంట్ గణేష్ ఆదినారాయణ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు నిరుపేదలని, అపస్మారస్థితిలోకి వెళ్లిన చినబాబును కాపాడేందుకు దాతలు సహకరించాలని కోరారు. సహాయం చేయాలనుకున్నవారు 9676635247 నెంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరారు. దాతలు ముందుకు రావాలని కోరారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కూలి పనికి వెళ్లిన ఒక మహిళను పాము కాటు వేయడంతో మృతి చెందింది. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి ఉప్పులూరి లక్ష్మి(48)కి భర్త నగేష్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి. లక్ష్మి బుధవారం ఉదయం కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలోని కండ్రికగూడెంలో మొక్కజొన్న పొత్తులను విరపడానికి వెళ్లింది. అక్కడ పాము కాటు వేయడంతో ఆమెను వెంటనే తోటి కూలీలు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఎంఎల్‌సిగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముత్యాలమ్మపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టి.నరసాపురం పంచాయతీలోని ముత్యాలంపేటకు చెందిన గుర్రం చెన్నారావు (32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయం నిమిత్తం అప్పులపాలై చేసిన అప్పులు తీర్చలేక ఈ నెల 25వ తేదీన తనకు చెందిన మొక్కజొన్న తోటలో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య ప్రభావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కురెళ్లగూడెంలో చోరీ

ప్రజాశక్తి - భీమడోలు

ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో తిరుపతి దేవస్థానానికి వెళ్లిన కురెళ్లగూడెం గ్రామానికి చెందిన రావిపాటి సత్య శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగిందని భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 15వ తేదీన సత్యశ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చారు. దుండగుటు ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో వస్తువులు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. 3.50 కేజీల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

నేడు, రేపు కొల్లేరు ప్రాంతంలో యాత్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరును ఐదు నుంచి మూడో కాంటూరుకు కుదిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, పర్యావరణంతో పాటు కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని, కొల్లేరు ప్రజలకు నష్టం కలిగించే ఎకో సెన్సిటివ్ జోన్ ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో కొల్లేరు ప్రాంతంలో నిర్వహిస్తున్న యాత్రను కొల్లేరు ప్రజలు జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో కొల్లేరు ప్రజలకు హామీలు ఇవ్వడం, వాటిని మర్చిపోవడం సర్వసాధారణం అయిపోయిందని తెలిపారు. 2006లో 120 జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని రక్షిస్తామనే పేరుతో ఆపరేషన్ కొల్లేరును నిర్వహించి ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల్లోని చెరువులన్నింటిని ధ్వంసం చేసి లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారని పేర్కొన్నారు. కొల్లేరులో రెగ్యులేటర్లు కడతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించడం మానేసి కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. 89 గ్రామాల్లోని లక్షలాదిమంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. మిత్ర కమిటీ, శ్రీ రామకృష్ణయ్య కమిటీ, అసెంబ్లీ రిపోర్టుల ఆధారంగా చానలైజేషన్, ముంపు నివారణ చర్యలు చేపట్టాలని, ఉప్పుటేరు ప్రక్షాళన ద్వారా వరదనీరు త్వరగా సాఫీగా సముద్రంలోకి పోయేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొల్లేరు ప్రజల సమస్యలపై ఈ నెల 27, 28 తేదీల్లో సిపిఎం ఆధ్వర్యంలో కొల్లేరు ప్రాంతంలో నిర్వహిస్తున్న యాత్రలో కొల్లేరు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

అంజలికి న్యాయం చేయాలి

రాజమండ్రి కిమ్స్ బొలినేని ఆసుపత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న అంజలి సూపర్‌వైజర్ దీపక్ వేధింపులు తట్టుకోలేక సూసైడ్‌కు ప్రయత్నించిన ఘటనపై తక్షణం విచారణ జరిపించి అంజలికి న్యాయం చేయాలని, వేధింపులకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని రవి పేర్కొన్నారు. డాక్టర్‌గా పనిచేస్తున్న అంజలి స్వస్థలం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామమని తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే తను ఆత్మహత్య ప్రయత్నం చేయడం తన మానసిక స్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌ను కలిసిన ముక్కంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.ముక్కంటి పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ముక్కంటికి అభినందనలు తెలిపారు. అనంతరం పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల అమలు గురించి చర్చ నిర్వహించారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు, ఎస్‌సి సామాజిక తరగతికి సంబంధించిన అన్ని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు.

ఎంఎల్‌ఎను కలిసిన ముక్కంటి

చింతలపూడి : జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సమర్ధవంతంగా పనిచేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలన్నాని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన ఎం.ముక్కంటి ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్, టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పలువురు ప్రజలు రోడ్లు, తాగునీరు, ఆర్అండ్ఆర్, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు, తదితర అంశాలపై వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై డిస్కౌంట్

ప్రజాశక్తి - ఏలూరు

ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం సరికొత్త వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు ఆప్కో రాజమండ్రి మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సిఆర్.రెడ్డి షోరూమ్, నేత బజార్ భవనం, సిఆర్.రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న ఆప్కో విక్రయశాలల్లో పై ఆఫర్లు అందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఆప్కో విక్రయశాలలు సందర్శించి తమకు కావాల్సిన చేనేత వస్త్రాలు కొనుగోలుచేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి కార్మికులను ఆదరించాలని కోరారు.

గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపై నియోజకవర్గ పరిధిలోని దెందులూరు, ఏలూరు, పెదపాడు, పెదవేగి మండలాల అభివృద్ధి అధికారులతో దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, కూటమి నాయకులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

పరీక్షకు 23 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

పదో తరగతి సామాన్యశాస్త్రం పరీక్షకు 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 935 మంది విద్యార్థులకు 912 మంది హాజరయ్యారని ఎంఇఒ అల్లూరి రవిప్రకాష్ తెలిపారు.

చిన్నారికి హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారికి చేయూత ఇవ్వడం ఆనందంగా ఉందని చింతలపూడి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యురాలు గోరింకాల భారతి అన్నారు. కొన్ని రోజుల క్రితం మండలంలోని దేశవరం గ్రామానికి చెందిన చిన్నపాప మంటలో పడి శరీరం కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న చింతలపూడి హెల్పింగ్ హ్యాండ్స్ దాతల ద్వారా విరాళాలు సేకరించిన రూ.11,500 గోరింకాల భారతి చేతులమీదుగా పాప మేనమామకు అందించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - చింతలపూడి

పాఠశాలలో విద్యార్థులకు వసతులు కల్పించతనికి దాతలు ముందుకు రావాలని ముక్కంపాడు ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణనాయక్ అన్నారు. మండలంలోని ప్రగడవరం, ముక్కంపాడులో అంగన్వాడీ, పాఠశాల విద్యార్థులకు ఫ్యాన్లు లేవని తెలుసుకుని చింతలపూడి మానవత స్వచ్ఛంద సంస్థ సహాయ సహకారాలతో ఫ్యాన్లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వెంకమ్మ, ఆయా, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి పరీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

ఎయిడ్స్ సోకిన తర్వాత ఇబ్బంది పడటం కన్నా, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా కొనసాగవచ్చని పలువురు అన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించటం, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వటం వంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ఎయిడ్స్ నుంచి రక్షణ పొందవచ్చని ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణ కార్యక్రమ జిల్లా అధికారి ఎం.నాగేశ్వరరావు అన్నారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద హెచ్ఐవి టెస్ట్ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. దీనికోసం ప్రత్యేకించిన మొబైల్ వ్యాన్ సిబ్బంది టెస్టులు చేయడంతో పాటు వ్యాధి విస్తరణ, నిర్ధారణ కార్యక్రమాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

గుండెకు స్టంట్ వేయించుకున్న వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతుని బంధువుల ఆందోళన

ఆసుపత్రి ఎదుట మృతుని బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిశ్చార్జ్ చేసిన 24 గంటల్లోనే వ్యక్తి మృతి చెందాడని, వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని మృతుని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. ఏలూరులోని పడమరి వీధికి చెందిన గంటా రామకృష్ణ (45) శంకరమఠం వీధిలో ఉన్న రితేష్ హార్ట్ కేర్ హాస్పిటల్‌లో గుండె సంబంధిత వ్యాధితో ఎనిమిది రోజుల క్రితం చేరారు. గుండెకు స్టంట్ వేసి ఎనిమిది రోజులు వైద్యం అందించిన తర్వాత మంగళవారం డిశ్చార్జ్ చేశారని బంధువులు తెలిపారు. మళ్లీ బుధవారం ఉదయం గుండె నొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లామన్నారు. ఆసుపత్రికి వెళ్లిన కొన్ని క్షణాల్లోనే రామకృష్ణ మృతి చెందాడని, వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని మృతుని బంధువులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. బుధవారం ఉదయం ఆసుపత్రికి వచ్చే సమయానికి రోగి మృతి చెందాడని ఆసుపత్రి సిబ్బంది తెలుపుతున్నారు. బంధువులు, ఆసుపత్రి యాజమాన్యం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

జీలుగుమిల్లి మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వేసవిలో ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జీలుగుమిల్లి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడగ్గా ఆయా శాఖలకు సంబంధించి పురోగతిని అధికారులు వివరించారు. అనంతరం ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా మండల సమస్యలపై దృష్టి పెట్టి మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అదే విధంగా వేసవి తాపం దృష్ట్యా ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, పలువురు సర్పంచులు ఎంపిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గేట్-2025లో ఎంపికైన విద్యార్థులకు అభినందన

నూజివీడు టౌన్ :ఇటీవల వెలువడిన గేట్-2025 ఫలితాల్లో ఆర్‌జియుకెటి నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్ చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటారని రిజిస్ట్రార్, డైరెక్టర్, నూజివీడు క్యాంపస్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే గేట్-2026లో ఇంతకంటే మెరుగైన ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌జియుకెటి హయ్యర్ ఎడ్యుకేషనల్ సెల్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, సెంట్రల్ డీన్ అకాడమిక్స్ శ్రావణి ఇటిపి డీన్ శ్యామ్, డీన్ ఆఫ్ అకాడమిక్ డాక్టర్ చిరంజీవి విద్యార్థులను అభినందించారు.

డ్వాక్రా ఉత్పత్తుల డెలివరీ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వం మహిళలను లక్షాధికారులను చేసే లక్ష్యంతో ఆన్‌లైన్‌లో వచ్చిన డ్వాక్రా ఉత్పత్తుల డెలివరీ వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయ్‌రాజు చెప్పారు. మండలంలోని కనకాద్రిపురం గ్రామంలో గుడ్ హెల్త్ బ్రాండ్ పేరుతో తయారు చేస్తున్న చిరుధాన్యాల ఉత్పత్తులను మంగళవారం రాత్రి పరిశీలించారు. ఒఎన్‌డిసి ఆన్‌లైన్ ప్లాట్ ఫారంలో డ్వాక్రా మహిళలు చేసిన ఉత్పత్తల తయారీ విధానం, ప్యాకింగ్ విధానం, ఏయే సంస్థల ద్వారా డెలివరీ చేస్తున్నారో తెలుసుకోవడానికి రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు ప్రాజెక్టు డైరెక్టర్ పరిశీలించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.జీవన్‌కుమార్

ఏలూరు సిటీ :పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏలూరులోని సత్రంపాడులో ఉన్న గెట్సేమనే సెంట్రల్ చర్చిలో పాస్టర్ అసోసియేషన్ వారు బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ ప్రగడాల మృతి చాలా బాధాకరమన్నారు. ఆయన మృతి చెందడం అనుమానాలకు తావిస్తుందన్నారు. పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఏలూరు సిటీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల జోసెఫ్, సభ్యులు పీటర్, పాస్టర్ కిరణ్ పాల్, ఏలూరు సిటీ పాస్టర్స్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

ఉంగుటూరు : చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో బిసి కార్పొరేషన్‌లో రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న బిసి, ఇబిసి, కాపు ఇతర సామాజిక తరగతుల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకుని ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయానికి రావాలని ఎంపిడిఒ జి.రాజుమనోజ్ బుధవారం తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ద్వారకాతిరుమల: సిహెచ్. పోతేపల్లిలోని గోద్రెజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ ఆయిల్ ఫామ్ సంస్థ వారి వన్ స్టాప్ సొల్యూషన్ సెంటర్ గ్రామాల్లోనీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. 2024 పరీక్షా ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత కనబరిచిన 52 మంది విద్యార్థులకు రూ.2.60 లక్షల నగదును అందించినట్లు తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.ఐదు వేల చెక్కును సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.మహంతి అందించారు. మండలంలోని పావులవారి గూడెం, పోతేపల్లి, ఉంగుటూరు మండలం గొల్లగూడెం, కామవరపుకోట మండలం ఆడమిల్లి, చింతలపూడి మండలం సీతానగరం, ముసునూరు, చాట్రాయి మండలాల్లో ఉన్న వన్ స్టాప్ సొల్యూషన్ సెంటర్ల ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు.

హిజ్రాను హత్య చేసిన వ్యక్తిని ఉరి తీయాలి

కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అనకాపల్లిలో ఈ నెల 19వ తేదీన దీపు అనే హిజ్రాను హత్య చేసిన దుర్గాప్రసాద్‌ను ఉరి తీయాలని హిజ్రాలు డిమాండ్ చేశారు. ఏలూరులోని వసంత మహల్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు బుధవారం హిజ్రాలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హిజ్రాలు మాట్లాడుతూ అనకాపల్లిలో దీపును అతి కిరాతకంగా చంపిన దుర్గాప్రసాద్‌ను ఉరితీయాలని డిమాండ్ చేశారు. సాధారణ మహిళలకు ఉన్నట్లే హిజ్రాలకు కూడా వారి భద్రత కోసం ప్రత్యేకమైన చట్టాలు చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రకృతి సిద్ధంగా సేంద్రీయ విధానంలో పండించే పంటల్లో నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ మాట్లాడారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులు చెన్నారావు, చాముండేశ్వరి, సూరిబాబు, శివశంకర్, వెలుగు డిపిఎం ప్రవీణ్, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ఆదివాసీ గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేకమైన జిల్లా ఏర్పాటు చేయాలని, పోలవరం, బుట్టాయగూడెం, రంపచోడవరం, చింతూరు, కుక్కునూరు డివిజన్లను కలుపుకుని ప్రత్యేకమైన ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాల తరఫున ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. ప్రజల అభ్యున్నతి, ప్రాంత అభివృద్ధి, భవిష్యత్తు తరాల అభివృద్ధికి దోహదపడే విధంగా జిల్లాను నామకరణం చేసి పునర్విభజన చేసి ఆదివాసీ జిల్లాగా తీసుకురావాలని కోరారు.

జిల్లా కారాగారం సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్ (ఎఫ్‌ఎసి) ఆధ్వర్యంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఏలూరులోని జిల్లా కారాగారాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన బాధ్యత న్యాయ సేవాధికార సంస్థలకు ఉందన్నారు.ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ప్రత్యక్షంగా గాని 08812 22455 లేదా 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - భీమడోలు

నవోదయ విద్యాలయ సమితి సంస్థలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించాలని ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ తెలిపారు. వీరిలో జెఎం.పురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివిన మావూరి జ్ఞాన శౌర్య, భీమడోలు ప్రయివేట్ పాఠశాలలో చదివిన హెచ్.బాంధవి ఉన్నారు.

ఉన్నత చదువులతోనే ఎస్‌సి వర్గీకరణ ఫలాలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎస్‌సి వర్గీకరణ ఫలాలు పొందాలంటే ఉన్నత చదువులతోనే సాధ్య పడుతుందని ఆగిరిపల్లి సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లిలోని ఎస్‌సి కాలనీ, సిఎస్ఐ చర్చి వద్ద ఎంఆర్‌పిఎస్ పిలుపులో భాగంగా డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ యువసేన ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ విజయసారథి పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు టి.నాగేంద్రబాబు, బి.రాము, బి.సురేష్, డి.దేవరాజు, ఎన్.కాంచనరావు, సిహెచ్.సురేష్‌బాబు, రంగారావు, ప్రేమానందం పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాలు

ప్రజాశకి - పోలవరం

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది సాధికారత సాధించాలంటే అందుకు విద్య ఒకటే మార్గమని పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సజిని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఎంపికైన పది మంది విద్యార్థినులను విద్యలో ప్రోత్సహించడానికి మలబార్ గోల్డ్ సంస్థ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. త్యాగరాజ సదన్ రాజమహేంద్రవరంలో ఆ సంస్థ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.పది వేలు విద్యార్థినులకు వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు.

సర్టిఫికెట్స్ పడిపోయినవి

పున్నం మనీషా ది. 20-3-2025 సం॥రం॥ తేదిన, నేను మా ఇంటి వద్ద నుండి రాత్రి గం. 7-45 ని॥లకు Bus Stand కు బయలుదేరాను. నేను నీలం రంగు కవరులో పెట్టుకున్న 10th క్లాస్, ఇంటర్, B.Sc డిగ్రీ Certificates నీలం రంగు కవరు Activa బండికి తగిలించుకుని మా ఇంటి నుండి మా నాన్నగారు నేను (పున్నం సత్యనారాయణ మూర్తి) Bus Stand కి బయలుదేరాము. మధ్యలో పెద్ద పోస్ట్ ఆఫీస్ దగ్గరకు వెళ్ళిన తరువాత చూసుకుంటే కవరు లేదు. మార్గ మధ్యలో ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

Hall ticket No.
10th Class - 1810100453 - 2018
Intermediate - 2004221957 - 2020
Degree (B.Sc.com)- 20303071 - 2023

P. MANEESHA
D.No. 34-22-11/2,
Narayana College,
Back Street, Tanuku
West Godavari Dist

గ్రామపంచాయతీ కార్యాలయము, ఆచంట, ఆచంట మండలం, ప॥గో॥ జిల్లా

ఆర్.ఒ.సి. నెం.144/2024-2025 **టెండరు నోటీసు** తేది.19-3-2025

పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామపంచాయతీ నందు కాంట్రాక్ట్ పద్ధతిపై ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు వివిధ రకముల పనులు చేయుటకు మరియు వివిధ రకముల సామాగ్రి సప్లయి చేయుటకు టెండర్లు కొరబడుచున్నవి. టెండర్లు దాఖలు చేయువారు ముందుగా ఈ క్రింది షెడ్యూలు నందు చూపిన ధరావతు చెల్లించి సీల్డు టెండర్లు పంచాయితీ కార్యదర్శికి గాని, వారి అనుమతి పొందిన వారికి గాని దాఖలు చేయవచ్చును. ది. 22-03-2025వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు టెండర్లు స్వీకరించబడి ది. 22-03-2025వ తేది మధ్యాహ్నం గం॥ 2-30 ని॥లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి గారిచే సీల్డు టెండర్లు తెరవబడును. ఇతర వివరముల కొరకు ఆఫీసు పనిచేయు సమయంలో అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ. నెం.	టెండర్ వివరం	వ్యక్తుల సంఖ్య	కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు
1.	పి.డబ్లు.ఎస్.స్కీం పంప్ ఆపరేటర్	6	01.04.2025 నుండి 31.03.2026 వరకు	100/-
2.	స్వీపర్లు & డ్రైన్ క్లీనర్	37	01.04.2025 నుండి 31.03.2026 వరకు	100/-
3.	వీధి దీపముల నిర్వహణ ఎలెక్ట్రిషియన్	2	01.04.2025 నుండి 31.03.2026 వరకు	100/-
4.	ప్రజారోగ్య సామగ్రి	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
5.	మంచినీటి సరఫరా సామగ్రి	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
6.	స్టేషనరి అండ్ బుక్స్ ఫామ్స్	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
7.	ఎలక్ట్రికల్ సామగ్రి	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
8.	రోజువారి అద్దె ట్రాక్టర్ సప్లయి చేయుట	-	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-
9.	పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు, కొబ్బరినూనే, సబ్బులు మరియు పాద రక్షలు	45	01.04.2025 నుండి 31.03.2026 వరకు	500/-

సం/- జి.వి.ఎన్.ఎల్. నరసింహారావు పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - ఆచంట,ఆచంట మండలం, ప॥గో॥జిల్లా